సాక్షి
మంచిర్యాల

మంగళవారం, 7, మే, 2024



భానుడి భగ భగ

జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండలు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఎండలో బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. IIలో▸



ప్రసవాలకు సెలవు

జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో ప్రసవాలు చేయడం లేదు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడంతో ఇబ్బంది పడుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
43.0 /29.0

వాతావరణం

మధ్యాహ్న సమయంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దపల్లి జిల్లాకు ధాన్యం తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: 'ధాన్యం దిగదు.. లారీ కదలదు' శీర్షికన ఈ నెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సోమవారం అధికారులు స్పందించారు. జిల్లాలోని 19మిల్లుల వద్ద రోజుల తరబడి అన్‌లోడ్ కాకుండా ఉండడంతో పక్క జిల్లా పెద్దపల్లిలోని 136 బాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయించారు. గత కొద్ది రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలిస్తే లారీలు అన్‌లోడ్ కాకపోవడంతో నిర్వాహకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు, కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. పక్క జిల్లాలోని మిల్లులకు కేటాయించడంతో ధాన్యం తరలింపు, లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం అవుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

'మరోసారి ప్రధానిగా మోదీ'



రోడ్డు షోలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమారం: నరేంద్రమోదీని మరోసారి దేశ ప్రధానిగా చూడాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పెద్దపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. బస్టాండ్ వద్ద మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో స్కాంలు పెద్దయెత్తున జరిగేవని విమర్శించారు. ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అభివృద్ధితోపాటు దేశ ప్రతిష్టత పెంచే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ కుటుంబ పాలనను అంతం చేయాలని, బీజేపీ అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, పార్టీ మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సింగరేణి ఉద్యోగులు

శ్రీరాంపూర్: పార్లమెంటు ఎన్నికల విధులకు సింగరేణి ఉద్యోగులనూ కేటాయించారు. ఈ నెల 13న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సిబ్బంది కావాలని జిల్లా కలెక్టరేట్ల నుంచి కంపెనీకి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు శ్రీరాంపూర్ డివిజన్‌లో 35 మంది క్లర్క్‌లు ఎన్నికల విధులకు హాజరు కానున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా వీరు విధులు నిర్వర్తించారు. ఎన్నికల నిర్వహణపై ఇదివరకే శిక్షణ పొందారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వీరంతా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో రిపోర్టు చేయనున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు. కాగా, ఎన్నికల విధులు నిర్వర్తించే వారికి కంపెనీ ఆ రోజును స్పెషల్ లీవుగా పరిగణిస్తుంది. దీన్ని ఓడీగా ఇవ్వాలని క్లర్క్‌లు డిమాండ్ చేస్తున్నారు.

చిరుతపులి సంచారం

జైపూర్: మండలంలోని కుందారం, మద్దులపల్లి, నర్సింగా శివారు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మూడు గ్రామాల ప్రజలు, రైతులను అప్రమత్తం చేశారు. చిరుత పులి సంచరిస్తోందని అటవీ ప్రాంతాల వైపు వెళ్లకూడదని సూచించారు. సమీప ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎలాంటి పాదముద్రలు కనించినా సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌లో కౌన్సిలర్ల చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్ల చేరికల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా తాజాగా సోమవారం మరో ఐదుగురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కౌన్సిలర్లు షేక్ అఫ్సర్, షేక్ ఆస్మా, కొక్కెర చంద్రశేఖర్, గడ్డం అశోక్‌గౌడ్, చిట్యాల లక్ష్మీ, బీఆర్ఎస్ శ్రేణులు గురుండ్ల సత్యనారాయణ, చిట్యాల మధు, బీఆర్ఎస్ మైనార్టీసెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఎజాజ్, టీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు షేక్ యూనిస్ ఉన్నారు. వీరికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ కేంద్రమంత్రి ఎస్.వేణుగోపాలచారి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సామాజిక న్యాయమిదేనా?

- ఆర్థికంగా ఉన్న కుటుంబానికే అవకాశాలు
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య సహకారం
- కార్మిక నేతగా ఇక్కడి సాధకబాధలు తెలుసు
- పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలంతా ఆలోచించాలి
- 'సాక్షి'తో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



'సాక్షి'తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెప్పే కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయమా..?' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. పుట్టుకతోనే ఆగర్భ శ్రీమంతుడిగా ఉన్న కార్పొరేట్ కంపెనీ సీఈవోకు, భూగర్భ గని కార్మికుడిగా పని చేసిన తనకు మధ్య ఉన్న పోటీలో ప్రజలు ఎటువైపు ఉంటారో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దళిత వర్గాల్లో మాదిగ, ఇతర ఉప కులాలను మోసం చేసిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న కొప్పుల ఈశ్వర్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కార్మిక ఉద్యమాలు చేశాం

మేం పుట్టింది.. పెరిగింది.. జీవిస్తోంది కార్మిక నేపథ్యంలోనే. నక్సల్స్ కాలం నుంచే సింగరేణి కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేశాం. గనుల్లో ప్రమాదాలు జరిగితే కొట్లాడినం. పరిహారం, వేతనాలు, బోనస్, సౌకర్యాల పెంపు కోసం ఉద్యమాలు చేశాం. 45రోజుల సమ్మె నుంచి తెలంగాణ ఉద్యమం దాకా కార్మిక క్షేత్రంలోనే ఉన్నాం. అనేక పోరాటాలతో కార్మికులకు పరిహారం, వేతనాలు, సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇవేమీ వారికి తెలియదు. పెద్దపల్లి ప్రాంత ప్రజలు ఐదుసార్లు ఆ కుటుంబం నుంచే ఎంపీగా గెలిపించారు. వెంకటస్వామి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడూ ఈ ప్రాంతానికి ఏం చేయలేదు. పరిశ్రమలు ఇతర చోట్ల స్థాపించి ఇక్కడి యువతకు అన్యాయం చేస్తున్నారు.

అధికారమే ఆ కుటుంబం పరమావధి

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే 'గడ్డం' కుటుంబం అధికారమే పరమావధిగా ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇలా తరచూ పార్టీలు మారారు. బీజేపీలో చేరినప్పుడు కాంగ్రెస్ వాదిగా ఉన్న గడ్డం వెంకటస్వామి ఆత్మ ఘోషించి ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉంటారో లేదోనని ఇప్పటికే ప్రచారం మొదలైంది. పెద్దపల్లి పరిధిలో తాత నుంచి మనవడి దాకా పోటీలో ఉంటున్నారు. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా జెండా మోసే పార్టీ కార్యకర్తలు, నాయకులు, విద్యావంతులకు రాజకీయ అవకాశాలు రాకుండా దెబ్బతీస్తున్నారు. తాజాగా 'కాకా' మనవడంటూ ఇక్కడి ప్రజలపై ఓ బడా పారిశ్రామికవేత్తను తెచ్చి రుద్దుతున్నారు. అధికారమే లక్ష్యంగా, నిబద్ధత లేని వారికి ఓటు వేయాలా..? అని ప్రశ్నిస్తున్నా.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే..

సింగరేణి ప్రైవేటీకరణ, కార్మికుల కష్టాలు తీర్చని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే. ఈ ఎన్నికల్లో ఇరు పార్టీల అభ్యర్థులు సహకరించుకుంటున్నారు. కేంద్రం ఇవ్వాల్సిన ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు పరిశ్రమ, నవోదయ స్కూళ్లు ఏవీ ఇవ్వలేదు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపారు. ప్రధాని మోదీ ప్రైవేటీకరణ చేయబోమని చెప్పి సింగరేణిలో ఐదు బొగ్గు బ్లాక్‌లు వేలం వేశారు. కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వలేదు. తెలంగాణ కోసమే పుట్టిన బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే సింగరేణిని కాపాడువచ్చని ప్రజలను కోరుతున్నా.

ఈ ప్రాంత అభివృద్ధికి కృషి

ఎంపీగా గెలిచాక పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. సింగరేణి కార్మికుల సంక్షేమం, రైల్వే, రహదారులు, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు, పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తాను. స్థానిక యువత ఉపాధికి కృషి చేస్తాను. ఇక్కడి అభివృద్ధే ధ్యేయంగా పార్లమెంట్‌లో గళమెత్తుతాను. నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా.

నిరుద్యోగ సమస్య తీరుస్తా

- పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ



మాట్లాడుతున్న పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ

నెన్నెల: పెద్దపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే బెల్లంపల్లి నియోజకవర్గ ప్రాంతంలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువకుల నిరుద్యోగ సమస్య తీర్చే బాధ్యత తనదేనని పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే తాను ఏర్పాటు చేసిన సంస్థలో సింగరేణి కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించానని చెప్పారు. పోడు భూములకు పట్టాలు, బెల్లంపల్లిలో మామిడి మార్కెట్, పల్లెపల్లెకు రవాణా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదన్నారు. కాకా వెంకటస్వామి, వినోద్, వివేక్‌లు ఈ ప్రాంతాన్ని ప్రగతిపథంలో నడిపించారని గుర్తు చేశారు. విశాఖ, కాకా చారిటబుల్ ట్రస్ట్‌ల ద్వారా పాఠశాలల అభివృద్ధి, గ్రామాల్లో మంచినీటి బోర్లు వేసినట్లు తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. ఎంపీగా గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, గుండ్ల సోమారం ఎంపీటీసీ దాగం రమేష్, నాయకులు తోట శ్రీనివాస్, చీర్ల కిషన్‌రెడ్డి, తారాచంద్, మల్లిక, గట్టు బానేష్, దుర్గంరవి, గోవింద్‌సింగ్ , మొహిద్ ఖాన్ పాల్గొన్నారు.

భూగర్భ జలాలు.. మరింత దిగువకు



దండేపల్లి మండలం గూడెంలో తాగునీటి బావిలో అడుగంటిన నీళ్లు

- మూడు నెలలుగా పడిపోతున్న వైనం..

దండేపల్లి: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో జిల్లాలో భూగర్భ జల మట్టం మరింత లోతుకు పడిపోతోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో భూగర్భ జలశాఖ నివేదిక ప్రకారం భూగర్భ నీటిస్థాయి 6.26 మీటర్లు ఉండగా, రెండు నెలల్లో అంటే మార్చి, ఏప్రిల్ నెలల్లో 7.58 మీటర్ల లోతుకు పడిపోయింది. ఈ యేడాది జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరు నుంచే నీటిమట్టం లోతుకు పడిపోవడంతో, యాసంగిలో వ్యవసాయబావులు, బోర్ల కింద పంటలు సాగు చేసిన రైతులు సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. పంటలు చేతికచ్చే సమయంలో సాగునీటి కొరత ఏర్పడడంతో పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ బావుల్లో పూడిక తీయించి నీటి మట్టాన్ని పెంచుకునేందుకు కొందరు రైతులు భగీరథ ప్రయత్నాలు చేశారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చిలో ఎండలు మండిపోయాయి. దీంతో భూగర్భ నీటి మట్టాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుత మే నెల ప్రారంభంలోనే జిల్లాలో 45 డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు భూగర్భ జలాలు మరితం దిగువకు పడిపోయయి.



వ్యవసాయ బావిలో క్రేన్‌తో పూడిక తీత(ఫైల్)

మూడు నెలలుగా జిల్లాలో భూగర్భ జలాల తీరు..(లోతు..మీటర్లలో)

మాసం	భూగర్భ జలాల లభ్యత
ఫిబ్రవరి	6.26 మీటర్లు
మార్చి	6.96 మీటర్లు
ఏప్రిల్	7.58 మీటర్లు

వర్షాలు కురవక..

జిల్లాలో 2023 వానకాలంలో సాధారణ వర్షపాతం 1070.2 మిల్లీమీటర్లకు గాను 1051.1 మిల్లీమీటర్లు నమోదైంది. సాధారణం కంటే 2 శాతం తక్కువగా కురిసింది. దీనికితోడు వేసవికి ముందు నుంచే ఎండల తీవ్రత పెరిగిపోవడం, సాగునీటి ప్రాజెక్టుల్లోను నీటి మట్టాలు భారీగా పడిపోవడంతో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 6.3 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. దీంతో దండేపల్లి మండలం వెల్లనూర్ వరకు నిలిచి ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పూర్తిగా తగ్గిపోవడంతో గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న మంచినీటి బావుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి.

వాహనాలు సిద్ధం

- ఎన్నికల సిబ్బంది, సామగ్రి రవాణాకు ఆర్టీఏ ఏర్పాట్లు
- మూడు నియోజకవర్గాల్లో సిబ్బందికి బస్సులు
- దివ్యాంగ ఓటర్ల తరలింపునకు ఆటోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఆర్టీఏ వాహనాలు సిద్ధం చేసింది. ఈ నెల 13న పోలింగ్ నేపథ్యంలో గ్రామ, మండల స్థాయిలో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సామగ్రి తరలింపునకు బస్సులు, కార్లు సమకూరుస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి తీసుకెళ్లడానికి ఆటోలు సమకూరుస్తున్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 98రూట్లకు అనుగుణంగా అధికారులు వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 12, 13వ తేదీల్లో వాటిని వినియోగించుకుంటారు. ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వర్తించే ఉన్నతాధికారుల కోసం అవసరమైన 100 కార్లను సమకూర్చారు. ఎన్నికల కోడ్ అమలు నుంచి ఎన్నికల పరిశీలనకు కేటాయించిన రూట్లలో కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో..

పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఉన్నాయి. ఎన్నికల ఉద్యోగులు, సిబ్బందితోపాటు సామగ్రి తరలింపునకు 214 వాహనాలు సిద్ధం చేశారు.

- దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. అచేతన స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ఇంటి నుంచి వచ్చి ఓటు వేసిన తర్వాత వెళ్లడానికి ఆటోలు అందుబాటులో ఉంచనున్నారు. ఇప్పటివరకు 492 ఆటోలు అవసరమని గుర్తించి సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు 150 ఆటోలు, గ్రామీణ ప్రాంతాలకు 350 ఆటోల వరకు కేటాయించి పోలింగ్ కేంద్రాల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

నియోజకవర్గం	ఆర్టీసీ బస్సులు	ప్రైవేటు స్కూల్ బస్సులు	టాటాఏస్‌లు	ఈవీఎంలు, వీవీప్యాట్లకు వాహనాలు
మంచిర్యాల	30	35	8	3
చెన్నూర్	35	31	5	3
బెల్లంపల్లి	26	38	6	3
మొత్తం	91	104	19	9

గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సోమవారం రాత్రి చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆరు నెలలైన అడ్రస్ లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంలాల్‌గిల్డా, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించండి

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని సింగరేణి కార్మికులు ఆదరించాలని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. సోమవారం మందమర్రి ఏరియా శాంతిఖని గని ఆవరణలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా ప్రజా, కార్మిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోని కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లో మరిన్ని కొత్త హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆగర్భ శ్రీమంతుడైన కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణతో తలపడుతున్న తాను సాధారణ వ్యక్తినని పేర్కొన్నారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి వెళ్లి ఉపాధి హామీ కూలీలు, బెల్లంపల్లి కాంటా చౌరస్తా, బజారు ఏరియా ప్రాంతంలో ప్రచారం చేసి పుర ప్రజలు, కూరగాయల వ్యాపారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ టి.సత్యనారాయణ, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు కొప్పుల లక్ష్మణ్, గణేష్, బడికెల సంపత్, మేడిపల్లి సంపత్, బడికెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిఖని గనిపై మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్



మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయంలో బారులు తీరిన ఎన్నికల సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా ఇంటి నుంచి ఓటు వేసేలా ఎన్నికల సంఘం వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం కల్పించింది. జిల్లాలో హోం ఓటింగ్ కోసం 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు 330 మంది దరఖాస్తు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ 8వరకు కొనసాగనుంది. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే 6,832 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓ కార్యాలయాలతోపాటు చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు వేస్తున్నారు. ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ అడిగి తెలుసుకుంటున్నారు. సోమవారం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను దాదాపు మూడు వేల మంది వరకు వినియోగించుకున్నట్లు సమాచారం.

ఈవీఎం కమిషనింగ్ సమర్థవంతంగా చేపట్టాలి

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా చేపట్టాలని పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్‌గుప్తా అన్నారు. సోమవారం బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది సవాల్‌గా స్వీకరించి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని చెప్పారు. అదనపు బ్యాలెట్ల ర్యాండమైజేషన్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చేపట్టామని అన్నారు. తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న రావేష్‌గుప్తా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చెన్నూర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. మండలంలోని కిష్టంపేట, కత్తెరసాల, కాచన్‌పల్లి, ఆస్నాద, నాగాపూర్, సోమనపల్లి గ్రామాలలో డీసీఎంఎస్, ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రసీదు ఇవ్వాలని తెలిపారు. హార్వెస్టర్ ద్వారా జరిగే వరికోతలను పరిశీలించి పలు సూచనలు చేశారు.



కొనుగోలు కేంద్రంలో అదనపు కలెక్టర్ మోతీలాల్

పని వేళలు మార్చాలని సీఎండీకి వినతి

శ్రీరాంపూర్: ఎండ తీవ్రత పెరిగినందున ఓసీపీల్లో పని వేళలు మార్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో వినతిపత్రం అందజేశారు. కంపెనీ రెండు రోజుల క్రితం షిఫ్ట్ వేళలు మార్చుతూ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, ఇవి సరిగ్గా లేవని పేర్కొన్నారు. ఫస్ట్ షిఫ్ట్‌ను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సెకండ్ షిఫ్ట్ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటలకు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారని, బొగ్గు ఉత్పత్తి తగ్గకుండా పని వేళలూ సర్దుబాటు చేసేలా ఏరియాల జీఎంలకు ఆదేశాలిస్తామని తెలిపారని సీతారామయ్య పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల విధులకు హాజరయ్యే సింగరేణి క్లర్క్‌లకు స్పెషల్ లీవ్ కాకుండా ఓడీ ఇవ్వాలని సీఎండీని కోరగా.. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలా ఇస్తున్నారో ఆ విధంగానే వర్తింపజేస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

పెళ్లింట విషాదం

- కూతుర్ని అత్తారింటికి సాగనంపి గుండెపోటుతో తండ్రి మృతి


మహ్మద్ ఎజాస్ (ఫైల్)

చెన్నూర్: అప్పటి వరకు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కూతురికి అంగరంగ వైభవంగా వివాహం జరిపించి అత్తారింటికి పంపించిన ఆ తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పబ్బావాడలో నివాసం ఉంటున్న మహ్మద్ ఎజాస్ (60) మెయిన్ రోడ్డులో జనరల్ స్టోర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి పెద్దకుమార్తె వివాహ వేడుకలను స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం కుమార్తెను అత్తారింటికి సాగనంపి ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కౌటాల: మండలంలోని గురుడుపేటకు చెందిన బొగరపు భీంరావు(35) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్ మధుకర్ తెలి పారు. మద్యం మత్తులో భార్యతో గొడవపడుతుండడంతో నెల రోజుల క్రితం తన ఇద్ద రు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం అతిగా మద్యం తాగి ఇంటిముందున్న సెల్ టవర్ ఎక్కడంతో స్థానికులు గమనించి వారించడంతో కిందకు దిగాడు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సెల్‌టవర్ ఎక్కడంతో ప్రమాదవశాత్తు జారి పడడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు శాన్విక్, కుమార్తె శాన్వి ఉన్నారు. మృతుని తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

'పనివేళలు మార్చాలి'

శ్రీరాంపూర్: ఎండలు ముదిరిపోవడంతో ఓసీపీల్లో కార్మికుల షిఫ్ట్ వేళలు మార్చాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎండలవల్ల కార్మికులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫస్ట్ షిఫ్టును ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సెకండ్ షిఫ్టును సాయంత్రం 5 నుంచి రాత్రి 11 వరకు ఏర్పాటు చేయాలన్నారు.

భానుడి భగభగ..

- జనం ఉక్కిరిబిక్కిరి
- ఎండ వేడికి తోడు.. వడగాలులు
- ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల ప్రభావంతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఎండలో బయటకు రావొద్దంటున్న వైద్యులు


జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద నిర్మానుష్యంగా రోడ్డు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు వడగాలులు వీస్తున్నాయి. హ్యూమిడిటీ(తేమ)తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలో ఉన్నా కూడా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడికి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండలు తారెత్తిస్తుంది. సాయంత్రం 5 గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే పలువురు వడదెబ్బతో మృతి చెందారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రిలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ప్రతీ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు ఉదయం వంద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారు. ఎవరికి అవసరమైనా వాటిని ఆయా వైద్య సిబ్బంది అందించి, మరుసటి రోజున మరో వంద ప్యాకెట్లను అందిస్తున్నారు.

రెడ్‌జోన్‌లో జిల్లా..

జిల్లాలో ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. మంచిర్యాలలో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంచిర్యాల, హాజీపూర్, నస్పూర్, భీమారం, జన్నారం, దండేపల్లి, కాసిపేట, చెన్నూరు, వేమనపల్లి మండలాలు రెడ్‌జోన్‌లో ఉన్నాయి. ఎండలు తారెత్తిస్తున్న నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లక పోవడమే మంచిదని, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసమై బయటకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలు..

తీవ్ర ఎండల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం, చెన్నూరు డిగ్రీ కళాశాలలోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఒక్కో కేంద్రంలో 1,200ల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు హెల్త్‌క్యాంపులు కొనసాగిస్తారు. బయటి ఆహారం తినొద్దని, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీంలు తినొద్దని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలి. ఎండ వేడి, వడగాలులు, తేమ శాతం పెరగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ అయ్యే అవకాశం ఎక్కువ. చల్లని నీరు కాకుండా సాధారణ నీటిని తాగుతూనే, ఓఆర్‌ఎస్ కలిపిన నీటిని తాగాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. ఎన్నికల సిబ్బందికి ఓఆర్‌ఎస్ అందిస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, సబ్ సెంటర్లలోనూ మందులు, సెలైన్ బాటిళ్లు సరిపడా అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ అనిత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

నేతకాని కార్పొరేషన్ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం నరేశ్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతకానీలు

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నేతకానీ కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యమవుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం నరేశ్ అన్నారు. ఇటీవల ధర్మపురిలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంపై సంఘం అధ్వర్యంలో సోమవారం సీఎం, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకాని కులస్తులను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంటెంకి పోచం, దుర్గం నగేశ్, రావుల తిరుపతి, వెంకటస్వామి, సునార్కర్ రాంబాబు, రాజేశ్, లీల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కే మాదిగల మద్దతు'


మాట్లాడుతున్న నాయకులు

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే మాదిగల మద్దతు ఉంటుందని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తగరం మధురాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలతోనే హక్కులను సాధించుకుందామన్నారు. కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం మాదిగలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రావణ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, చెన్నూర్ ఇన్‌చార్జి అశోక్, కార్యదర్శి కె.రాజు, నాయకులు నరేందర్, శ్రీనివాస్, పోచం, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో ఉద్యోగుల పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అధిక ఆదాయ మార్గాలు– లక్ష్యే లక్ష్యం సాధన–ఆర్టీసీ ఉద్యోగుల కర్తవ్యం, కుటుంబ సభ్యుల పాత్ర సహకారం అనే అంశంపై మే 1 నుంచి 20 వరకు నాలుగు ఏ4 సైజ్ పేపర్లకు మించకుండా వ్యాసం రాసి డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారిని హైస్కూల్ నుంచి ఇంటర్ వరకు ఒక కేటగిరీగా, ఆపై చదువులు చదివే పిల్లలను మరో కేటగిరీగా విభజించినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలు హడావుడిగా కాకుండా ఇంటి వద్ద నిదానంగా రాసుకునేలా అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు (ఉద్యోగుల పిల్లలు) ఆర్టీసీ సీఐ, డిపో మేనేజర్ ఆఫీసులో నమోదు చేసుకోవాలన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలి'


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

మందమర్రిరూరల్: ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటువేసి గెలిపించాలని కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరారు. సోమవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశీకృష్ణ ఎంపీగా గెలిస్తే సింగరేణిలో కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, కోలిండియాలో మాదిరిగా సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ట్యాక్స్ యాజమాన్యమే చెల్లించే విధంగా కృషి చేస్తారన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఐఎన్టీయూసీ నాయకులు సమ్మయ్య, దేవి భూమయ్య, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు తగిలి బొలెరో దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

జైపూర్: మండలంలోని నర్వలో సోమవారం వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం విద్యుత్ తీగలకు తగలడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిర్యానికి చెందిన శ్రీకాంత్ తన బొలెరో వాహనంతో నర్వ నుంచి వరిగడ్డి తీసుకెళ్తుండగా నర్వ గ్రామ సమీపంలో విద్యుత్ తీగలకు తాకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వరిగడ్డితో పాటు వాహనం దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా అప్పటికే వాహనం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.7లక్షలవరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

'వంశీ గెలిస్తే కార్మికుల పక్షాన గొంతు వినిపిస్తాడు'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపిస్తే కార్మికుల పక్షాన గొంతు వినిపిస్తాడని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏరియాలోని కేకే–5 గని వద్ద మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు సింగరేణి కార్మికుల ఇన్‌కంటాక్స్ రద్దు కోసం పార్లమెంట్‌లో మాట్లాడానన్నారు. అప్పుడు ఉన్న స్లాబ్ ప్రకారం ఇన్‌కంటాక్స్ తగ్గింపు జరిగిందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని, కార్మికులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం


విరబూసిన మే పుష్పం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని ఏఎంసీ ఏరియాలో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి ఇంటి ఆవరణలో తొట్టిలో పెంచుతున్న మే పుష్పం సోమవారం నిండుగా విరబూసింది. ఎరుపురంగును పులుముకున్న పుష్పం చూపరులకు కనువిందు చేస్తోంది.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం


రోడ్డు పక్కనే టిఫిన్ చేస్తున్న ఈశ్వర్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సోమవారం తెల్లవారు జామునే ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉదయం 6 గంటలకు శాంతిఖని గని వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అక్కడి నుంచి బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి వెళ్లి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రచారంలో భాగంగా బజారు ఏరియాలో రోడ్డు పక్కన ఉన్న ఓ టిఫిన్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు.

గమ్యం యాప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో సోమవారం రాత్రి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు గమ్యం యాప్ ఇన్‌స్టాల్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణించే సమయంలో ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డిపో సేఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి పాల్గొన్నారు.

విషపురుగు కాటుతో బాలుడు మృతి


దుర్గేష్ మృతదేహం

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి న్యూ కాలనీ పక్కనే ఉన్న మామిడితోటలో సోమవారం విషపురుగు కాటుతో రాంకరణ్ దుర్గేష్ (5) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాంకరణ్ రాంప్రసాద్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పెద్దనపల్లి శివారులో న్యూకాలనీ వద్ద ఉన్న మామిడితోటలో కాయలు తెంపేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసే సరికి దుర్గేష్ కుడిచేతి మట్టపై వాపు కనిపించింది. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ లారీ!


సారంగపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ లారీ

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారులు ప్రైవేట్ లారీల ద్వారా ధాన్యాన్ని ప్రైవేట్ రైస్‌మిల్లులకు కమీషన్ ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన లారీల రాకకోసం రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు ప్రైవేట్ వారిని ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే ఈ కొనుగోలు కేంద్రం నుంచి రెండు లారీల ధాన్యం తరలించినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రైవేట్ లారీలపై చర్యలు తీసుకుని త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి తరలించే విధంగా అధికారులు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

సోన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జోగేంద్ర (30) సోన్ మండల కేంద్రంలో పదేళ్లుగా హోటల్ నడిపేవాడు. అంతేకాకుండా చిట్టీలు కూడా నడిపించేవాడు. చిట్టీలలో నష్టం రావడంతో సభ్యులకు డబ్బులు చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కొక్కానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బిడ్డను చూడకుండానే కన్నుమూసిన తల్లి

- ఆస్పత్రిలో బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ


రవళిక (ఫైల్)


ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ

మంచిర్యాలక్రైం: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి కళ్లనిండా చూసుకోకుండానే కాటికి చేరుకున్న ఘటన సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బెల్లంపల్లికి చెందిన బొల్లు వెంకటేశ్ భార్య రవళిక (26) సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నందిని ఆస్పత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఆస్పత్రి వైద్యురాలు సాధారణ డెలివరీ చేయడంతో బాబుకు జన్మనిచ్చింది. సదరు మహిళకు అధిక రక్తస్రావం కావడంతో వైద్యురాలు అర్జంటుగా రక్తం కావాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంకటేశ్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తం తీసుకు వచ్చేలోగానే వైద్యురాలు నందిని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పకుండానే మహిళను సమీపంలోని మెడిలైఫ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యురాలు నందిని, మెడిలైఫ్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రవళిక మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ధాన్యం కొనుగోళ్లు లేక రైతుల ఇబ్బందులు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


రైతులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

మందమర్రిరూరల్: ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం మండలంలోని సారంగపల్లి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో 2.50 కిలోల మెట్రిక్ టన్నుల ధాన్యం 15, 16 రోజుల్లో రైస్ మిల్లులకు పంపించామన్నారు. ప్రస్తుతం 1.5 కిలోల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చిందని, ఆ ధాన్యాన్ని కూడా కొనలేక ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఊరుకునేది లేదన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన గాందేవార్ కృష్ణమూర్తి, పుష్పలత (56) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కృష్ణమూర్తి ప్రస్తుతం ఇచ్చోడ మండలం పిప్రి గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు అదనంగా చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో తీవ్రనష్టం వాటిల్లింది. అంతేకాకుండా కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ కాలనీలోని వినాయక్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని బయటకు తీశారు. అప్పటికే పుష్పలత మృతి చెందగా కృష్ణమూర్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రీన్‌బక్కెట్ పార్శిల్ హోటల్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గ్రీన్ బక్కెట్ బిర్యానీ పార్శిల్ హోటల్‌లో సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. హోటల్ వెనుక భాగం నుంచి ఓ బాలుడు లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఆ హోటల్ యజమాని నాగేందర్ తెలిపాడు. ముగ్గురు వ్యక్తులు బయట ఉన్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్లు తెలిపాడు. మొత్తం రూ.8వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొంగలించినట్లు వివరించాడు. కాగా చోరీకి పాల్పడిన బాలుడు నిర్మల్‌లో పట్టుబడినట్లు తెలిపాడు. ఈ నలుగురే ఇదివరకు రెండుసార్లు తమ హోటల్‌లో చోరీకి పాల్పడినట్లు వివరించారు.

గంజాయి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామంలో తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన దాంజీ, భీంరావు నివాసాల్లో గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.